Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

RAJADHANIVARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కాదే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు


rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 6 సంచిక (Issue) : 348 పేజీలు (Pages) : 4 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

మంగళవారం, 3 - 6 - 2025

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com RNI No.: APTEL/2019/77985 స్థాపితం : 2015

## ఏఐతో మానవ సమాజం ఉనికికే ముప్పు : భారత సంతతి ప్రొఫెసర్



**ఇంటర్నెట్ డెస్క్ :** ఏఐ సాంకేతికత నానాటికీ వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఏఐ ప్రభావంతో మధ్యతరగతి వర్గం కనుమరుగవుతుందని ఇప్పటికే కొందరు జోస్యం చెబుతున్నారు. అయితే, ఏఐతో మానవ సమాజానికే ముప్పు ఉందని ఏఐ నిపుణుడు, భారత సంతతికి చెందిన ప్రొఫెసర్ సుభాష్ కక్ హెచ్చరించారు. ఏఐ కారణంగా 2300 సంవత్సరం నాటికల్లా ప్రపంచ జనాభా కేవలం 100 మిలియన్‌లకు కుంచించుకుపోతుందని హెచ్చరించారు. న్యూయార్క్, లండన్ వంటి మహా నగరాలు నిర్మానుష్యంగా మారిపోతాయని అన్నారు. ఓక్లహోమా స్టేట్ యూనివర్సిటీ రీజెంట్స్ ప్రొఫెసర్ సుభాష్.. ఓ యూకే పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ విషయాలను వెల్లడించారు. ఉద్యోగాలు మొదలు ప్రభుత్వ నిర్ణయాలు, పిల్లల పెంపకం వరకూ మానవ జీవితానికి సంబంధించి ప్రతి అంశంలో ఏఐ ప్రభావం అమితంగా పెరిగిపోతుందని ప్రొ.సుభాష్ తెలిపారు. మనుషులకు ఉండే చైతన్యం ఏఐకి లేకపోయినా మనం చేసే పనులన్నీ అది చేసి పెడుతుందని అన్నారు. ఏఐతో త్వరలో వచ్చే విచ్ఛిన్నకర మార్పులను మానవ సమాజం తట్టుకోలేదని హెచ్చరించారు. రాబోయే రెండు శతాబ్దాల్లో అన్ని వృత్తులు మానవ ప్రమేయం అవసరం లేని విధంగా ఆటోమేషన్‌కు గురవుతాయని అన్నారు. ఫలితంగా పిల్లల్ని పెంచడం ఆర్థికంగా సామాజికంగా పెను భారమై ప్రపంచ వ్యాప్తంగా సంతానోత్పత్తి రేటు భారీగా పడిపోతుందని చెప్పారు. 'ఇక ప్రజలు పిల్లల్ని కనాలని కోరుకోరు. ప్రస్తుతం దక్షిణ కొరియాలో భారీగా జనాభా తగ్గుదలను చూస్తున్నాం. దాదాపు ఇదే రీతిలో ఐరోపా, చైనా, జపాన్‌లో పరిస్థితులు కనిపిస్తున్నాయి' అని ఆయన అన్నారు. 'ప్రస్తుతం ప్రపంచ జనాభా 8 బిలియన్‌లు. కానీ 2300 లేదా 2380 నాటికి జనాభా 100 మిలియన్‌లకు పడిపోతుంది. ఇది ప్రస్తుత యూకే జనాభాకు సమానం' అని అన్నారు. భారీ నగరాలన్నీ నిర్మానుష్యంగా, దెయ్యాల దిబ్బల్లా మారుతాయని, సమాజం కుప్పకూలుతుందని హెచ్చరించారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వ నిర్ణయాలను సైతం ప్రభావితం చేయగలిగే స్థితికి ఏఐ చేరుకుంటుందని అన్నారు. ఇప్పటికే యూఎస్, యూరోపియన్ యూనియన్‌లో పలు నిర్ణయాలను ఏఐ అల్గోరిథమ్‌లు ప్రభావితం చేస్తున్నాయని చెప్పారు. ఏఐతో ప్రమాదంపై టెక్ ఆంత్రప్రెన్యూర్ ఎలాన్ మస్క్‌కు కూడా దాదాపు ఇలాంటి హెచ్చరికలే చేశారు.

## పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుపై కేంద్రం ముందుకు ఏపీ ప్రతిపాదనలు




**న్యూఢిల్లీ:** పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుపై కేంద్రం ముందుకు ఏపీ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసింది. పోలవరం నుంచి బనకచర్లకు నీటి తరలింపు ప్రాజెక్టుపై కేంద్ర ఆర్థిక శాఖకు రాష్ట్ర అధికారులు పూర్తి వివరాలు అందించనున్నారు. రూ.81 వేల కోట్లతో రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టును ప్రతిపాదిస్తోంది. ఈ ప్రాజెక్టుతో రైతులకు, ప్రజలకు కలిగే ప్రయోజనాలపై రాష్ట్ర ఆర్థిక, నీటిపారుదల శాఖల అధికారులు ప్రజెంటేషన్ ద్వారా వివరించనున్నారు. గత నెల జరిగిన భేటీల్లో ఈ ప్రాజెక్టు ప్రతిపాదనలను ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్‌కు ఏపీ సీఎం చంద్రబాబు వివరించారు. కాగా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతిపాదనపై పూర్తి వివరాలు ఇవ్వాలని గతంలో కేంద్ర ఆర్థిక శాఖ కోరింది. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం 3 గంటలకు ఏపీ ఆర్థిక శాఖ కార్యదర్శి పీయూష్ కుమార్, నీటిపారుదల శాఖ సలహాదారు వెంకటేశ్వరరావు, ఇతర అధికారులు కేంద్ర ఆర్థిక శాఖ కార్యదర్శి అజయ్ సేత్‌కు ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. ప్రాజెక్టు సమగ్ర వివరాలను అధికారులు కేంద్ర ఆర్థిక శాఖకు వివరించనున్నారు. ప్రాజెక్టు వల్ల కలిగే ప్రయోజనాలు, నీటి పంపిణీ విధానం, భూసేకరణ, ప్రజలకు వచ్చే లాభ నష్టాలపై వివరాలు అందించనున్నారు. భవిష్యత్తులో పోలవరం బనకచర్ల ప్రాజెక్టు స్వీయ ఆర్థిక ప్రాజెక్టుగా ఉంటుందని అధికారులు వివరించనున్నారు. తెలంగాణ లేవనెత్తుతున్న అభ్యంతరాలపై కూడా ప్రజెంటేషన్‌లో సమాధానం ఇచ్చే అవకాశముంది. సముద్రంలోకి వృధాగా పోతున్న సుమారు 2 వేల టీఎంసీల నీటిని వినియోగించుకునే అవకాశం ఉందని సీఎం చంద్రబాబు ఇప్పటికే స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు వల్ల ఎగువ ఉన్న తెలంగాణకు కూడా ఉపయోగమే ఉంటుంది తప్ప.. ఆ రాష్ట్ర నీటిని తామేమీ తీసుకోవడం లేదని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## సీఎం రేవంత్‌రెడ్డి.. రాజీవ్ యువ వికాస్ పేరుతో డ్రామా మొదలెట్టారు

**సిద్దిపేట జిల్లా, (రాజధాని వార్తలు):** తెలంగాణలో కాంగ్రెస్ పథకాలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని బీఆర్ఎస్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఇవాళ (జూన్2) తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సిద్దిపేట జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో జాతీయ జెండాను కొత్త కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కొత్త ప్రభాకర్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి ఎలక్షన్‌లో ఇచ్చిన హామీలు అట్టర్ ప్లాఫ్ అవుతున్నాయని ఎద్దేవా చేశారు కొత్త ప్రభాకర్‌రెడ్డి.

యువతకు దగ్గర అవుదామని సీఎం రేవంత్‌రెడ్డి రాజీవ్ యువ వికాస్ అనే పేరుతో డ్రామా మొదలుపెట్టారని కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆరోపించారు. రాజీవ్ యువ వికాస్ పథకం వాయిదా వేయడమంటే ఈ ప్రభుత్వం సరిగా పనిచేయట్లేదని అర్థమని చెప్పారు. ఈ ప్రభుత్వాన్ని ముఖ్యమంత్రి నడుపుతున్నారా లేక మంత్రులు, ఎమ్మెల్యేలు నడుపుతున్నారా అర్థం కాని పరిస్థితి ఉందని విమర్శించారు. రాజీవ్ యువ వికాస్ పథకంలో రిజిస్ట్రేషన్ కోసం యువత రూ.2000 ఖర్చు పెట్టుకుని నష్టపోతున్నారని వివరించారు కొత్త ప్రభాకర్‌రెడ్డి. గ్రామాల్లో ఇం దిరమ్మ ఇండ్లకు కాంగ్రెస్ నాయకుల పేర్లను మాత్రమే తీసుకుం టున్నారని కొత్త ప్రభాకర్‌రెడ్డి చెప్పుకొచ్చారు.

ఇందిరమ్మ ఇండ్లు చిన్నగా ఉండటంతో ప్రజలు వాటిని తిరస్కరిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ నాయకులు పథకాల పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ నేతలకు దమ్ము, ధైర్యం ఉంటే బీఆర్ఎస్ నాయకులతో పోరాటం చేయాలి కానీ ప్రజలను మోసం చేయకూడదని హితవు పలికారు. సీఎం రేవంత్‌రెడ్డికి పాలన చేయడం రాకుంటే తాము డైరెక్షన్ ఇస్తాం, అది కూడా కాదంటే ముఖ్యమంత్రినీ మార్చాలని కొత్త ప్రభాకర్ రెడ్డి సూచించారు.

## రసవత్తరంగా తిరువూరు చైర్మన్ ఎన్నిక

**తిరువూరు, (రాజధాని వార్తలు):** ఎన్టీఆర్ జిల్లా తిరువూరు మున్సిపల్ చైర్మన్ పదవిని టిడిపి కైవసం చేసుకుంది. టిడిపి అభ్యర్థి కోలిక పోగు నిర్మల 11 ఓట్లతో విజయం సాధించారు. పది మంది టీడీపీ కౌన్సిలర్లతో పాటు ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఓటు హక్కును వినియోగించుకోవడంతో నిర్మల గెలిచారు. వైసీపీ అభ్యర్థి మోతుకు ప్రసాద్‌కు 9 ఓట్లు వచ్చాయి. దీంతో ఎన్టీఆర్ జిల్లా తిరువూరు నగర చైర్మన్ ఎన్నిక ప్రశాంతంగా ముగిసింది. తెలుగుదేశం పార్టీ బలపరిచిన ఒకటవ వార్డు కౌన్సిలర్ కె.నిర్మలకు ఎమ్మెల్యే ఓటు పాటు, 10 మంది కౌన్సిలర్లు మద్దతు పలికారు. తిరువూరు నగర పంచాయతీ చైర్మన్‌గా ఎన్నికైన నిర్మలకు శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించారు ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని), ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఎంపీ చిన్ని.. వైసీపీ నాయకులు, కౌన్సిలర్లను వారి కుటుంబాలకు దూరం చేసి క్యాంపు రాజకీయాలు నడిపారన్నారు. టీడీపీ పార్టీగా తామెవ్వరం క్యాంపు రాజకీయాలు నడపలేదని.. టిడిపి కౌన్సిలర్లు స్వేచ్ఛగా తిరువూరులోనే వారి నివాసంలో కుటుంబ సభ్యులతోనే గడిపారని చిన్ని తెలిపారు. విజయవాడకు చెందిన వైసిపి గుండాలు తిరువూరు నగర పంచాయతీ చైర్మన్ ఎన్నిక సందర్భంగా అలజడి సృష్టించేందుకు ప్రయత్నించారని.. తెలుగు తమ్ముళ్ల తిరుగుబాటుతో వెనుదిరిగారని చిన్ని అన్నారు. నాలుగేళ్లలో నగర




పంచాయతీలో అభివృద్ధి జరగకుండా వైసిపి నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించిందని ఎంపీ విమర్శించారు. ఈరోజు నుంచే తిరువూరు నగర పంచాయతీ అభివృద్ధికి ప్రణాళికాయుతంగా, యుద్ధ ప్రాతిపదికన పనులు చేయడానికి చర్యలు మొదలు పెడతామని ఎంపీ కేశినేని చిన్ని పేర్కొన్నారు. తాగునీరు, నగరంలో పారిశుధ్యం, రోడ్ల అభివృద్ధి, డ్రైనేజీ వ్యవస్థ సమస్యలను ఆరు నెలల్లో పరిష్కరించే విధంగా ప్రణాళిక బద్ధంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ నిధులతో తిరువూరు నగర పంచాయతీని మొదటి స్థానంలో నిలిపేలా కృషి చేస్తామని ఎంపీ ధీమా వ్యక్తం చేశారు. తిరువూరు నగర పంచాయతీ చైర్మన్ ఎన్నికకు సహకరించిన ఎన్డీఏ కూటమి నేతలకు, మీడియాకు, పోలీసులకు ధన్యవాదాలు తెలిపారు ఎంపీ కేశినేని శివనాథ్.

## సజ్జల కనుసన్నల్లో మాత్రమే వైసీపీ ప్రభుత్వం నడిచింది

### - ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత



**విజయవాడ, (రాజధాని వార్తలు):** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నేరాల సంఖ్య తగ్గిందని ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. తెనాలిలో రౌడీ షీటర్లపై పోలీసులు ఓపెన్ ట్రీట్ మెంట్‌పై హోంమంత్రి అనిత స్పందించారు. శాంతి భద్రతలను కంట్రోల్ చేయాల్సింది పోలీసులేనని తెలిపారు. తప్పు చేసిన వారికి కులం ఏంటి మతం ఏంటని ప్రశ్నించారు. పోలీసులపై దాడి చేసే వారికి కూడా రాజకీయ రంగు పులమటం ఏంటని నిలదీశారు. గత జగన్ ప్రభుత్వంలో డాక్టర్ సుధాకర్ మాస్క్ అడిగితే రెక్కలు విరిచి కొట్టారని మండిపడ్డారు హోంమంత్రి వంగలపూడి అనిత. గతంలో సీఎం చంద్రబాబు అమరావతికి వెళ్తే రాళ్లు విసిరీ భావ స్వేచ్ఛ ప్రకటన అని అన్నారని హోంమంత్రి వంగలపూడి అనిత గుర్తుచేశారు. టీడీపీ ఆఫీసుపై దాడి చేస్తే తమ కార్యకర్తలకు బీపీ వచ్చిందని జగన్ అనలేదా అని నిలదీశారు. సజ్జలకు మాట్లాడే అర్హత లేదని ధ్వజమెత్తారు. గత ప్రభుత్వ హయంలో పోలీస్ శాఖ సీఎం, హోం మంత్రి చేతుల్లో లేదని.. సజ్జల కనుసన్నల్లో మాత్రమే గత జగన్ ప్రభుత్వం నడిచిందని ధ్వజమెత్తారు. తాము పోలీసులను చట్టపరంగా పని చేసే స్వేచ్ఛను ఇచ్చామని చెప్పారు. వైసీపీ నాయకులు సిగ్గులేకుండా అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇవాళ (సోమవారం) విజయవాడలో నూతనంగా నిర్మించిన సత్యనారాయణపురం పోలీస్‌స్టేషన్‌ను హోం మంత్రి అనిత, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ప్రారంభించారు. ఈ సందర్భంగా హోంమంత్రి అనిత మీడియాతో మాట్లాడారు. మోడల్ పోలీస్టేషన్‌గా సత్యనారాయణపురం పోలీస్టేషన్‌కు రికార్డు ఉందని ఉద్ఘాటించారు. ఇక్కడ కార్పొరేట్ ఆఫీస్‌కు వచ్చిన అనుభూతి కలిగిందని తెలిపారు. 320 గజాల స్థలంలో రూ. 2 కోట్లతో నిర్మాణం చేశామని అన్నారు. ఏపీలో జిమ్ ఉన్న తొలి పోలీస్టేషన్ ఇదేనని చెప్పారు. మహిళలు, పిల్లలకు సౌకర్యంగా ఉండేలా నిర్మాణం చేశామని వెల్లడించారు. సత్యనారాయణపురం పోలీస్టేషన్ పరిధిలో రెండువందల కెమెరాలు పెట్టామని తెలిపారు. రౌడీ షీటర్ల కదలికలపై దృష్టి పెట్టి వారి ఫేస్ రికగ్నైజ్ పెట్టామని వివరించారు. సీపీ రాజశేఖర్ బాబు ఆధ్వర్యంలో సాంకేతిక పరిజ్ఞానంతో నేరస్థులను అరెస్టు చేస్తున్నారని తెలిపారు. ఎలాంటి నేరం జరిగినా నేడు వెంటనే నిందితులను పోలీసులు పట్టుకుంటున్నారని చెప్పారు హోంమంత్రి వంగలపూడి అనిత. ప్రజలకు రక్షణ కల్పించడంతో పాటు, నేరస్థులను అరెస్టు చేస్తున్నామని హోం మంత్రి వంగలపూడి అనిత చెప్పుకొచ్చారు. ఏపీ వ్యాప్తంగా లక్ష కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించారు. ఏపీలో ఇటీవల గంజాయి రవాణా చాలావరకు తగ్గిందని చెప్పారు. ఒరిస్సా నుంచి కొంత రవాణా అవుతుందని... అది అరికడతామని అన్నారు. జూన్ 21వ తేదీన అంతర్జాతీయ యోగా డేలో పోలీసులు భాగస్వామ్యం అవుతున్నారని తెలిపారు. ప్రతిజిల్లాలో ఐదు వేల మంది పోలీసులు యోగాంధ్రలో పాల్గొంటారని అన్నారు. కూటమి ప్రభుత్వంలో అక్రమ అరెస్టులు లేవు, హౌస్ అరెస్టులు లేవని స్పష్టం చేశారు. తాము పరదాలు కట్టుకుని దాక్కుని వెళ్లడంలేదని చెప్పారు. ప్రజలతో, ప్రజల మధ్య తిరుగుతున్నామని హోంమంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు.

## జమ్మూకు ఒక న్యాయం...విశాఖకు మరో న్యాయమా

### - వైజాగ్ రైల్వే జోన్ ఎందుకివ్వరు? - దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ అధ్యక్షుడు శంకర్రావు

**విజయవాడ, (రాజధాని వార్తలు):** జమ్మూ రైల్వే డివిజన్ ఏర్పాటుకు డీపీఆర్ రెడీ కావటంతో పాటు ఏకంగా పరిపాలనను ప్రారంభిస్తూ గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం...విశాఖ రైల్వేజోన్ విషయంలో ఎందుకు గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వలేకపోతోందని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ అధ్యక్షుడు సీహెచ్ శంకర్రావు ప్రశ్నించారు. విజయవాడలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. 2014లో రీ-ఆర్గనైజేషన్ యాక్ట్‌లో ఏపీకి ప్రత్యేక రైల్వే జోన్ సాధ్యాసాధ్యాలపై రిపోర్టు ఇవ్వటానికి పార్లమెంట్‌లో ఆమోదం లభించిందని గుర్తు చేశారు. ఆ తర్వాత డీపీఆర్ కూడా ఆమోదం పొందిందని, ఇప్పటికి పదేళ్లు గడిచినా జోన్ ఏర్పాటు కాలేదన్నారు. 2025-జనవరిలో ప్రకటించిన జమ్మూ రైల్వే డివిజన్‌కు 6 నెలల్లోపే డీపీఆర్ తయారు చేయించారని, వెంటనే ఆమోదం కూడా పొందిందన్నారు. గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వటంతో పాటు జూన్ 1 నుంచి పరిపాలన కూడా ప్రారంభమైందన్నారు. దక్షిణ కోస్తా రైల్వే జోన్‌పై ఎందుకు కేంద్ర ప్రభుత్వం సవతిప్రేమ చూపిస్తోందని ప్రశ్నించారు. భూమి ఇవ్వలేదన్న



పేరుతో కొన్నేళ్లుగా కాలయాపన చేశారని, . చంద్రబాబు అధికారంలోకి రాగానే భూములను అప్పగించి కొత్త భవనాల శంకుస్థాపనకు చర్యలు చేపట్టారని, కేంద్రం ఎందుకు జీవో ఇవ్వట్లేదని నిలదీశారు. రాష్ట్రానికి చెందిన పార్లమెంట్ సభ్యులు విశాఖ రైల్వే జోన్‌పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా ప్రధానితో మాట్లాడి కేంద్ర ప్రభుత్వం ద్వారా జీవో ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

# సమావేశం నిర్వహించాలంటూ వైసీపీ కౌన్సిలర్లు నిరసన





**సామర్లకోట, (రాజధాని వార్తలు):** సామర్లకోట మున్సిపాలిటీలో ప్రతినెల జరగవలసిన కౌన్సిల్ సమావేశం "మే" నెలకి సంబంధించి సమావేశం ఏర్పాటు చేయకపోవడంతో వైసిపి కౌన్సిలర్లు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ నల్ల బ్యాడ్జీలు ధరించి మున్సిపల్ కార్యాలయం వద్ద తమ నిరసనను తెలియజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ ఊబా జాన్ మోజెస్ మాట్లా డుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో సైతం కౌన్సిల్ సమావేశాలు యధావిధిగా జరపగా, ఈనెలలో సమావేశం నిర్వహించడంలో అధికారులు ఎందుకు తాత్సారం చేస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. పట్టణంలో అనేక సమస్యలు, అభివృద్ధి పనులకు సంబంధించి సమావేశంలో చర్చ జరగాల్సి ఉండగా వాటిని పక్కదారి పట్టించే విధంగా అధికారులు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. దీనిపై కమిషనర్ స్పందించి కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ శ్రీ విద్యను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

# వైసీపీ యువజన విభాగ జాయింట్ సెక్రెటరీగా కరణం



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** వైయస్సార్ సిపి పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ రాష్ట్ర యువజన విభాగ కమిటీ నియామకం జరిగింది. దానిలో సామర్ల కోటకు చెందిన యువ నాయకులు కరణం భానుకు స్థానం లభించింది. ఈ మేరకు కరణం భానును పార్టీ అదీస్థానం యువజన విభాగ కమిటీలో జాయింట్ సెక్రటరీలలో ఒకరిగా నియమించింది. కాగా ఈ పదవి పట్ల భాను హార్షం వ్యక్తం చెయ్యగా సామర్లకోట పట్టణానికి చెందిన వైసీపీ నాయకులు, కౌన్సిలర్‌లు భానుకు అభినందనలు తెలిపారు.

# ఇంజనీరింగ్ కార్మికుల భిక్షాటన



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** ప్రభుత్వం తక్షణమే స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు శనివారం బిక్షాటన నిరసన చేపట్టారు. తమ సమస్యల పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సామర్లకోట మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఇంజనీరింగ్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం 25వ రోజుకు చేరింది. సామర్లకోట మున్సిపల్ కార్యాలయం ఎదుట కొనసాగుతున్న సమ్మె శిబిరంలో నాయకులు మాట్లాడుతూ, సాంకేతిక నిపుణత కలిగిన కార్మికులకు రూ. 29,200, నాన్-టెక్నికల్ కార్మికులకు రూ. 24,500 వేతనాలు ఇవ్వాలని, 15 సంవత్సరాలకు పైగా సేవ చేసిన వారిని క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ.10 లక్షల పరిహారం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలని, సీనియారిటీ ప్రకారం వేతనాలు చెల్లించాలన్న నినాదాలు చేశారు. అలాగే సంక్షేమ పథకాలు, హెచ్ఆర్ పాలసీ అమలుపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. శిబిరంలో బిక్షాటన చేస్తూ తమ డిమాండ్లపై పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు కొండవీటి రామరాజు, ఉపాధ్యక్షులు కృష్ణ, నాయకులు మేడిపోయిన రమణ, రత్నరాజు, రమేష్, కురుకూరి మురళీ కృష్ణ, చిక్కాల నాగార్జున, ఉండవల్లి రామరాజు, సత్యనారాయణ, భూదేవి, వెంకటేశ్వరరావు, స్వామి, చంద్రు రాజేష్, వారా సన్నీ బాబు, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలపై మున్సిపల్ కమిషనర్ పర్యటన



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెద్దాపురం మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి శనివారం పట్టణంలో సుడిగాలి పర్యటన చేపట్టారు. వేకువ జాము నుంచే పట్టణంలో చేపడుతున్న పారిశుధ్య పనులను ఆయన స్వయంగా పర్యవేక్షించారు. పెద్దాపురం మెయిన్ రోడ్డులో గల డైలీ కూరగాయల మార్కెట్‌ను పరిశీలించి, చెత్త సేకరణపై వ్యాపారులకు అవగాహన కల్పించారు. ప్రతి రోజు రాత్రివేళ వచ్చే మున్సిపల్ సిబ్బందికి వ్యర్ధ పదార్థాలను, చెత్తను అప్పగించి, పట్టణ పరిశుభ్రతకు సహకరించాలని సూచించారు. ఇంకా పట్టణంలో రహదారులు, వీధి దీపాలు, త్రాగునీటి సరఫరాలను పరిశీలించారు. ప్రజలను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ వెంట మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

# ఉరి తాళ్లతో ఇంజనీరింగ్ ఉద్యోగుల నిరసన




**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెద్దాపురం మున్సిపల్ కార్యాలయం వద్ద శనివారం మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు వినూత్న రీతిలో నిరసన తెలిపారు. తాళ్ళతో ఉరి పోసుకుని ఆత్మహత్య చేసుకుంటామని భాదను వ్యక్తం చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. తమ న్యాయ సమ్మతమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన సమ్మె శనివారం 25వ రోజుకు చేరింది. వేతనాలు పెంచి, విధులు రెగ్యులర్ చెయ్యాలని డిమాండ్ చేశారు. ఈ సమ్మె నిరసనలో కార్మికులు శంకర్, నాగేశ్వరరావు, కోణా వెంకట రమణ, వాకాడ భాస్కరరావు, సూర్యప్రకాశ్, భద్రరావులు పాల్గొన్నారు.

# ఉపాధి వేతనదారులకు 200 రోజులు పని, రూ.600 వేతన కల్పించాలి : ఎం.రాజశేఖర్



**కరప, (రాజధాని వార్తలు):** ఉపాధి హామీ పథకం కార్మికులకు 200 రోజులు పని కల్పించి, రోజుకు వేతనాన్ని రూ.600కి పెంచాలని కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.రాజశేఖర్ డిమాండ్ చేశారు. కరప గ్రామంలో ఉపాధి వేతనదారులను కలిసి వారి సమస్యలు తెలుసుకున్న ఆయన, నాలుగు వారాల వేతన బకాయిలు తక్షణం విడుదల చేయాలని అధికారులను కోరారు. ప్రస్తుత ఆర్థిక స్థితుల్లో పప్పులు, నూనె, బియ్యం, కరెంట్ బిల్లులు వంటి నిత్యావసరాల ధరలు భారీగా పెరిగాయని ఆయన అన్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది ఉపాధి హామీ పథకానికి నిధులు రూ.70,000 కోట్ల నుంచి రూ.50,000 కోట్లకు తగ్గించడం దురదృష్టకరమని విమర్శించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం కేవలం రూ.7 మాత్రమే వేతనాన్ని పెంచడం సరిపోదని తెలిపారు. "కార్మికులు నాలుగు వారాలుగా పని చేసినా వేతనాలు అందకుండా కుటుంబాలు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. వెంటనే బకాయిలను చెల్లించకపోతే ఉద్యమాలు తప్పవు," అని రాజశేఖర్ హెచ్చరించారు. వామపక్షాల కృషి వల్ల యుపిఎ హయాంలో వచ్చిన ఉపాధి హామీ పథకాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత కార్మికులదని పేర్కొన్నారు. కార్మికుల సమస్యలపై జూన్ 9న జిల్లా వ్యాప్తంగా ధర్నా నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు.

# కరప మండలంలో 89.77 శాతం పెన్షన్లు పంపిణీ



**కరప, (రాజధాని వార్తలు):** కాకినాడ రూరల్ పరిధిలోని కరప మండలంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ మే 31న శనివారం విజయవంతంగా జరిగింది. జూన్ 1వ తేదీ సెలవు దినం కావడంతో ముందస్తుగా పెన్షన్ల పంపిణీ చేపట్టినట్లు మండల అభివృద్ధి అధికారి (ఎంపీ డీవో) ఎం.అనుపమ తెలిపారు. మండలంలోని 23 గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న 21 సచివాలయాల ద్వారా మొత్తం 11,223 లబ్ధిదారులకు రూ. 4.83 కోట్ల విలువైన పెన్షన్లు పంపిణీ చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు 10,075 మందికి రూ. 4.29 కోట్ల పెన్షన్లు వారి నివాసాలవద్దనే పంపిణీ చేశామని ఎంపీడీవో తెలిపారు. దీంతో మొత్తం 89.77 శాతం పంపిణీ పూర్తయిందని వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంలో సచివాలయ సిబ్బంది, వీఆర్వోలు, కూటమి నాయకులు, ఇతర ప్రభుత్వ అధికారులు ముఖ్య పాత్ర పోషించినట్లు ఆమె కొనియాడారు. మిగిలిన లబ్ధిదారులకు జూన్ 2న పెన్షన్ల పంపిణీ కొనసాగుతుందని, ఇటీవల కొత్తగా నమోదు అయిన వితంతువులకు జూన్ 12న పెన్షన్లు అందజేయనున్నట్లు తెలిపారు.

# పెనుగుదురులో జిల్లా వ్యవసాయ అధికారుల పర్యటన

## - రైతులు ఖరీఫ్ సాగుకి సన్నద్ధం కావాలి : విజయ్ కుమార్





**కరప, (రాజధాని వార్తలు):** కాకినాడ రూరల్, కరప మండల పరిధిలోని పెనుగుదురు గ్రామంలో శనివారం జిల్లా వ్యవసాయ అధికారి ఎన్. విజయ్ కుమార్ క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే జూన్ 1న ప్రభుత్వం సాగునీరు విడుదల చేయనుండటంతో రైతులు ముందస్తు ఖరీఫ్ సాగుకు సన్నద్ధం కావాలన్నారు. ముందస్తు ఖరీఫ్ సాగు చేపడితే, అక్టోబర్ నెలాఖరులోనే పంట చేతికి వచ్చే అవకాశం ఉందని, దానివలన నవంబరులో వచ్చే తుఫాన్ల వల్ల కలిగే నష్టాన్ని నివారించవచ్చునని ఆయన వివరించారు. ఖరీఫ్ వరి సాగులో వ్యవసాయ కూలీల కొరతను అధిగమించేందుకు బెంగాల్ ఊడుపు పద్ధతిని అనుసరించాలన్నారు. అలాగే దిగుబడి పెంచేం దుకు పొటాష్ వినియోగం, నానో యూరియాను డ్రోన్ సాంకేతికత ద్వారా ప్రయోగించాలన్న సూచనలు చేశారు. విత్తన ఎంపిక విషయంలో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా సూచించే రకాల విత్తనాలనే రైతులు వాడాలన్నారు. ముందస్తు ఖరీఫ్ సాగును చేపడితే, దాల్వా మార్చి 15లోపు పూర్తి చేసి, మూడో పంటగా వేసవి ఆపరాలను పండించేందుకు అవకాశముంటుందన్నారు. ఇది భూసారం పెంపుతో పాటు రైతులకు అదనపు ఆదాయం కూడా అందించగలదని వివరించారు. ఈ పర్యటనలో కరప సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు కే.బాబురావు, కరప మండల వ్యవసాయ అధికారి ఏ.వి. రాజేష్, వ్యవసాయ విస్తరణ అధికారి బండారు శ్రీరాములు పాల్గొన్నారు. గ్రామ పెద్దలు బండారు మురళి, గంటా నానిబాబు, రైతులు పబ్బినీడి చక్రరావు, తుమ్మలపల్లి గోవిందు, నామా ఆంజనేయులు, బండారు గోపాలకృష్ణ, పెంకె మల్లేశ్వరరావు తదితర కౌలు రైతులు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# తొలి తిరుపతికి రూ. 3.34 లక్షలు ఆదాయం





**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** తొలి తిరుపతిగా ప్రసిద్ధి చెందిన శ్రీ శృంగారవల్లభ స్వామి దేవస్థానమునకు శనివారం భక్తులు పోటెత్తారు. శనివారం ఒక్కరోజు స్వామివారికి రూ. 3,34,407 ఆధాయం లభించింది. సుమారు 15 వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఉదయమే స్వామివారిని పుష్పాలతో అలంకరించి భక్తుల దర్శనానికి అనుమతించారు. కాగా ఆలయానికి ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా రూ. 2,27,80, అన్నదాన విరాళములు ద్వారా రూ 67,407, కేశ ఖండన ద్వారా రూ. 7600, తులాభారం ద్వారా రూ. 550, లడ్డు ప్రసాదం ద్వారా 28,779, స్వామివారి కానుకల ద్వారా రూ. 3000 వెరశి రూ. 3,34,407 ఆదాయం వచ్చినట్టు ఆలయ కార్యనిర్వాహణాధికారి వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. కాగా దేవస్థానం తరుపున భక్తులకు ఉదయం పులిహోర ప్రసాదం, ఉచితంగా పంపిణీ చేశారు. అలాగే సుమారు 3,500 మంది భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు, గ్రామ నాయకులు సహకారం అందించినట్టు ఆలయ అధికారి శ్రీనివాస రావు తెలిపారు.

# అది మీ కర్మ.. తప్పుగా అర్థం చేసుకుంటే నేనేం చేయలేను : రాజేంద్రప్రసాద్



టాలీవుడ్ సీనియర్ నటుడు రాజేంద్రప్రసాద్ కొద్ది రోజులుగా తన కామెంట్స్‌తో వార్తల్లో నిలుస్తున్న విషయం తెలిసిందే. ప్రెస్ మీట్స్, సినిమా ఈవెంట్స్ లో ఆయన చేసిన కామెంట్స్ చర్చనీయాంశంగా మారుతున్నాయి. అందుకు సంబంధించిన విజువల్స్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారి చక్కర్లు కొడుతున్నాయి. దీంతో అనేక మంది నెటిజన్లు రెస్పాండ్ అవుతున్నారు. ఎందుకలా అలా స్టేజ్ పై మాట్లాడుతున్నారని క్వశ్చన్ చేస్తున్నారు. ఒక సీనియర్ నటుడు అయ్యి ఉండి హుందాగా ప్రవర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అంటున్నారు. ఇప్పుడు ఆ విషయంపై తన లేటెస్ట్ మూవీ షష్టిపూర్తి సక్సెస్ మీట్‌లో రాజేంద్ర ప్రసాద్ స్పందించారు. “ఈ మధ్య కొన్ని ఫంక్షన్లలో సరదాగా మాట్లాడుతున్నా కూడా అది తప్పుగా అర్థం చేసుకుంటున్నారు. అది మీ కర్మ. మీ సంస్కారం మీద ఆధారపడి ఉంటుంది. నేనేం చేయలేను. ఒకవేళ తప్పుగా అర్థం చేసుకుంటే మీ సంస్కారం. నేను అయితే ఇలాగే ఉంటాను. సరదాగా ఉంటాను. కానీ వేరే లాగా అర్థం చేసుకుంటున్నారు” అని తెలిపారు. “ఇండస్ట్రీలో నటీనటులంతా నాతో సరదాగా ఉంటారు. వారికి నేనెప్పుడూ అన్ని విషయాలు చెబుతుంటాను. ఈ మధ్య నేను పరిచయం చేసిన హీరోయిన్ అని.. యాక్టర్ గురించి మాట్లాడితే అంతా తప్పుగా అనుకున్నారు. నేను ఇలాగే ఉంటాను. ఎందుకంటే వారికి అన్నయ్యని కాబట్టి” అని రాజేంద్ర ప్రసాద్ ఇప్పుడు చెప్పుకొచ్చారు. కాగా, ఇటీవల జరిగిన ఎస్వీ కృష్ణారెడ్డి పుట్టినరోజు వేడుకకు ఆయన వచ్చారు. స్టేజ్ పైకి వచ్చి మాట్లాడుతుండగా.. అప్పుడే సినీ నటి, మాజీ మంత్రి రోజా అక్కడికి వచ్చారు. దీంతో ఆమెను చూసిన రాజేంద్ర ప్రసాద్ విష్ చేశారు. అంతటితో ఆగకుండా.. ఏమే నిన్ను కూడా నేనే హీరోయిన్‌ను చేశాను కదా అని అన్నారు. అప్పుడు రోజా విని నవ్వుకున్నారు. ఆ తర్వాత సీనియర్ నటి ఆమనిని.. నిన్ను కూడా నేనే హీరోయిన్‌ను చేశానని అన్నారు. కమెడియన్ అలీని ఉద్దేశించి బూతు మాట ఆడారు. కాదంబర్ కిరణ్ ను కాకి (కాదంబర్ కిరణ్) అంటూ పిలిచారు. దీంతో కార్యక్రమానికి వచ్చిన వారంతా షాక్ అయినట్లు కనిపించారు. అంతకు ముందు రాబిన్ హుడ్ మూవీ ఈవెంట్ లో వార్నర్ పై కామెంట్ చేసి, ఆ తర్వాత సారీ చెప్పారు. మొత్తానికి వరుసగా తన వ్యాఖ్యలతో వార్తల్లో నిలుస్తున్నారు.

# అది విని నాన్న భరించలేకపోయారు



కెరటం అనే బై లింగ్యువల్ ఫిల్మ్‌తో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన రకుల్ ప్రీత్ సింగ్, వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ సినిమాతో హీరోయిన్‌గా మంచి పేరు తెచ్చుకుంది. ఆ తర్వాత పండగ చేస్కో, సరైనోడు, ధృవ, రారండోయ్ వేడుక చూద్దాం, నాన్నకు ప్రేమతో, జయ జానకి నాయక ఇలా వరుస పెట్టి సినిమాలు చేసుకుంటూ వెళ్లి టాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది. తెలుగులోనే కాకుండా తమిళ, కన్నడ, హిందీ భాషల్లో పలు సినిమాలు చేసిన రకుల్ తన ప్రేమికుడు జాకీ భగ్నానీని పెళ్లి చేసుకుని ప్రస్తుతం బాలీవుడ్ పైనే ఎక్కువ ఫోకస్ పెట్టింది. రీసెంట్‌గా రకుల్ ఓ యూట్యూబ్ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో సెలబ్రిటీలపై వచ్చే రూమర్ల గురించి, వాటి ప్రభావం తమపై, తమ కుటుంబం ఎలా పడుతుందనే విషయాన్ని వెల్లడించింది. సభ్య సమాజంలో ఏదైనా సరే ఒకటి ఉంటే దాన్ని పదింతలు చేసి చెప్పడం, లేనివి కల్పించడం, పుకార్లు పుట్టించడం సహజం. సినీ ఇండస్ట్రీలో ఆ రూమర్లు ఇంకాస్త ఎక్కువ ఉంటాయి. కొంతమంది ఆ రూమర్లను లైట్ తీసుకుంటే, మరికొందరు మాత్రం వాటిపై క్లారిటీ ఇస్తూ అసలు విషయాలను బయటపెడుతూ ఉంటారు. ఇప్పుడు రకుల్ కూడా తన గురించి వచ్చిన ఓ రూమర్‌పై క్లారిటీ ఇచ్చింది. రకుల్ ప్రీత్ సింగ్‌కు హైదరాబాద్‌లో ఓ ఇల్లుందనే సంగతి అందరికీ తెలిసిందే. హైదరాబాద్ లో రకుల్ ఉండే ఇల్లు ఆమె సంపాదించిన డబ్బుతో కొనుక్కున్నది కాదని, ఎవరో పొలిటీషియన్ ఆమెకు గిఫ్ట్‌గా ఇచ్చాడనే వార్త అప్పట్లో బాగా ప్రచారమైంది. తాజాగా రకుల్ దీనిపై మాట్లాడి క్లారిటీ ఇచ్చింది.

హైదరాబాద్‌లోని ఇంటిని ఎవరో నాకు గిఫ్ట్ ఇచ్చారనే వార్త చూసి తన తండ్రి చాలా కోప్పడ్డారని తెలిపింది. ఆ ఇంటికి సంబంధించిన రిజిస్ట్రేషన్ వర్క్స్ నుంచి అన్నీ స్వయంగా ఆయనే చూసుకున్నారని, అలాంటి ఇంటిని వేరెవరో గిఫ్ట్ ఇచ్చారనే వార్తలు విని ఆయన భరించలేకపోయారని, నువ్వు కష్టపడి సంపాదించిన డబ్బుతో కొన్న ఇల్లు ఎవరో గిఫ్టుగా ఇచ్చారని ఎలా అంటారని ఫైర్ అయ్యారని, దానికి తాను ఇలాంటి రూమర్లకు మనం రెస్పాండ్ అయ్యే పన్లేదని చెప్పానని, కానీ తన తండ్రి మాత్రం వాళ్లకు సమాధానం చెప్పాల్సిందేనని పట్టు బట్టారని, చివరకు ఎలాగోలా ఆయనకు నచ్చచెప్పినట్టు రకుల్ చెప్పుకొచ్చింది.

# కృష్ణ ఒకే హీరోయిన్‌తో 45 సినిమాలు చేశారు తెలుసా..!



సూపర్ స్టార్ కృష్ణ మన మధ్య లేకున్నా ఆయన చేసిన సినిమాలు ఎప్పటికీ ఆయన్ను గుర్తుకు తెస్తూనే ఉంటాయి. తెలుగు సినిమా పరిశ్రమకు సాంకేతిక పరిజ్ఞానం అందించడంలో, తెలుగు సినిమాను నెక్ట్స్ లెవల్‌కి తీసుకు వెళ్లడంలో ఆయన కీలక పాత్ర పోషించారు అనడంలో ఎలాంటి సందేహం లేదు. అలాంటి సూపర్ స్టార్ కృష్ణ ఇప్పుడు మన మధ్య లేకపోవడం అనేది బాధాకరం అంటూ అభిమానులు ఎప్పుడూ మాట్లాడుకుంటూనే ఉన్నారు. తాజాగా జయంతి సందర్భంగా అభిమానులు సోషల్ మీడియా ద్వారా ఆయన జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. సుదీర్ఘకాలం పాటు ఆయన చేసిన సినిమాల గురించి, ఆయన పాత్రల గురించి మాట్లాడుకున్నారు. కృష్ణ ఎన్నో రకాల పాత్రలను చేశారు. తెలుగు సినిమా చరిత్రలో మరే హీరో పోషించనన్ని పాత్రలను కృష్ణ పోషించారని, మొదటి కౌబాయ్ సినిమా మొదలుకుని బాండ్ సినిమా వరకు కృష్ణ చేసిన తర్వాతే తెలుగు సినిమా ఇండస్ట్రీలో ఇతర హీరోలు చేశారు అంటూ అభిమానులు గొప్పగా, గౌరవంగా చెప్పుకుంటూ ఉంటారు. ఇక వందల కొద్ది సినిమాలు చేసిన కృష్ణ అత్యధికంగా సీనియర్ హీరోయిన్ జయప్రదతో నటించారు. పది కాదు.. ఇరవై కాదు ఏకంగా 45 సినిమాలను జయప్రదతో కృష్ణ కలిసి నటించారు. ఇలాంటి రికార్డ్ చాలా అరుదుగా మాత్రమే నమోదు అవుతూ ఉంటుంది. ఈ తరం హీరోలు ఎవరూ కూడా ఒకే హీరోయిన్‌తో కనీసం అయిదు.. పది సినిమాలు చేసే పరిస్థితి లేదు. అప్పట్లో హీరోలు నెలకు ఒకటి, అంతకు మించి సినిమాలను ప్రేక్షకుల ముందుకు తీసుకు రావడంలో సఫలం అయ్యారు. చాలా స్పీడ్‌గా సినిమాలు చేయడంతో పాటు, వందల కొద్ది సినిమాల సంఖ్యను కలిగి ఉన్నారు. అందుకే వారు ఎక్కువ సినిమాలను ఒకే హీరోయిన్‌తో చేసే అవకాశం ఉండేది. అందుకే కృష్ణ ఏకంగా 45 సినిమాల్లో హీరోయిన్‌గా జయప్రద నటించారు. జయప్రద, కృష్ణ కాంబోలో వచ్చిన సింహాసనం, రామరాజ్యంలో భీమరాజు, మహాసంగ్రామం వంటి సినిమాలు బ్లాక్ బస్టర్ విజయాన్ని సొంతం చేసుకున్నాయి. అందుకే వీరి కాంబోకి హిట్ పెయిర్‌గా పేరు దక్కింది. హీరోగా కృష్ణ ఇంకా పదుల సంఖ్యలో హీరోయిన్స్‌తో నటించారు.

కృష్ణ చనిపోయే వరకు నటిస్తూనే ఉన్నారు. ఆయన తన జీవితం మొత్తం సినిమాలకు అంకితం చేశారు. ఆయన మృతి తెలుగు సినిమా ఇండస్ట్రీకి తీరని లోటు అనడంలో సందేహం లేదు. ఆయన వారసుడిగా ఎంట్రీ ఇచ్చిన మహేష్ బాబు సూపర్ స్టార్ ట్యాగ్‌ను దక్కించుకుని తండ్రికి తగ్గ తనయుడు అనిపించుకుంటున్నారు. ఎన్నో సూపర్ హిట్ సినిమాలు చేసిన మహేష్ బాబు ప్రస్తుతం టాలీవుడ్ జక్కన్న రాజమౌళి దర్శకత్వంలో సినిమాను చేస్తున్నాడు. గ్లోబల్ బ్యూటీ ప్రియాంక చోప్రా హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాను 2027లో ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. అతి త్వరలోనే సినిమా నుంచి కీలక ప్రకటన వచ్చే అవకాశాలు ఉన్నాయని మేకర్స్ ద్వారా సమాచారం అందుతోంది.

# సూపర్ స్టార్ చివరి ప్రాజెక్ట్ అదే కావచ్చట..!



సూపర్ స్టార్స్ నుంచి చిన్న స్టార్స్ వరకు అందరికీ ఏదో ఒక డ్రీమ్ ప్రాజెక్ట్ ఉంటుంది. ప్రస్తుత స్టార్స్‌లో చాలా మందికి పౌరాణిక నేపథ్యం ఉన్న సినిమాలు లేదా సిరీస్‌లు చేయాలని కోరికగా ఉంది. అందులో భాగంగానే పలువురు స్టార్స్‌కి మహాభారతం ప్రాజెక్ట్ చేయాలని కోరుకుంటూ ఉంటారు. చాలా కాలంగా ప్రముఖ దర్శకుడు రాజమౌళి తన డ్రీమ్ ప్రాజెక్ట్‌గా మహాభారతంను చెబుతూ వస్తున్న విషయం తెల్సిందే. మహాభారతంను పలు పార్ట్‌లుగా చేయాలని కోరుకుంటున్నాను అంటూ పలు సందర్భాల్లో చెప్పాడు. అయితే మహాభారతం చేసిన తర్వాత తాను మళ్లీ సినిమాలు చేయకపోవచ్చు అని రాజమౌళి అన్నారు.

మహాభారతం సినిమాను చేయడం కోసం తనకు ఉన్న అనుభవం సరిపోదు అనుకుంటున్నాను. అందుకే ఆ సినిమాను చేయడం కోసం మరికొన్ని సంవత్సరాలు వెయిట్ చేస్తాను అన్నాడు. తాజాగా బాలీవుడ్ సూపర్ స్టార్ ఆమీర్ ఖాన్ సైతం ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఇటీవల అమీర్ ఖాన్ తన సితారే జమీన్ పర్ సినిమా ప్రమోషన్ కార్యక్రమాల్లో భాగంగా ఒక పాడ్ కాస్ట్‌లో పాల్గొన్నాడు. రాజ్ షమానీతో పాడ్ కాస్ట్‌లో ఆమీర్ ఖాన్ పాల్గొన్నాడు. ఆ సమయంలో ఆమీర్ ఖాన్ మాట్లాడుతూ... నా చివరి శ్వాస వరకు సినిమాలు చేస్తూ ఉండాలి అనుకుంటున్నాను. అయితే తాను ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న మహాభారతం సినిమా ప్రారంభం చేయాలని అనుకుంటున్నాను. మహాభారతం అనేది చాలా లోతుగా తీయాల్సిన సినిమా, ఆ ప్రాజెక్ట్‌ను చేసిన తర్వాత ఇక చేయడానికి ఏమీ ఉండదు. మహాభారతంలో అన్ని భావోద్వేగాలు, అన్ని రకాల ఫీలింగ్స్‌ను చూపించే అవకాశం ఉంటుంది. ప్రపంచంలోని అన్ని రకాల ఫీలింగ్స్‌ను మహాభారతం కథలో చూపించే అవకాశం ఉంటుంది. ప్రపంచంలో మన చుట్టూ జరుగుతున్న ఘటనలు, సంఘటనలు మహాభారతంలో మనం చూస్తూ ఉంటాం. అందులో లేనిది అంటూ ఏమీ లేదు. అందుకే మహాభారతం సినిమాను తీయాలి అంటే మామూలు విషయం కాదు. తక్కువ సమయంలో మహాభారతంను సినిమాగా తీయడం అంత సులభమైన విషయం కాదు. అందుకే చాలా ఎక్కువ సమయం తీసుకుంటాను అన్నట్లుగా చెప్పుకొచ్చాడు. అమీర్ ఖాన్ నటించిన తారే జమీన్ పర్ సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. ఆ సినిమా రెండు దశాబ్దాలు అయినా ఇప్పటికీ అభిమానులను అలరిస్తూనే ఉంది. అందుకే ఇప్పుడు ఆ సినిమాకు సీక్వెల్‌గా సితారే జమీన్ పర్ సినిమా రూపొందింది. జూన్ 20న ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఈ సినిమాలో ఆమీర్ ఖాన్ విభిన్నమైన పాత్రలో కనిపించాడు. ఈ సినిమా రీమేక్ అనే వార్తలు వస్తున్నాయి. ఆమీర్ ఖాన్ దశాబ్ద కాలంగా సాలిడ్ సక్సెస్‌ను దక్కించుకోలేక పోయాడు. ఈ సినిమాతో అయినా సూపర్ హిట్ సొంతం చేసుకోవాలని అభిమానులు కోరుకుంటున్నారు. అమీర్ ఖాన్ ఈ సినిమా తర్వాత ఒక భారీ కమర్షియల్ సినిమాను చేసేందుకు రెడీ అవుతున్నాడు. త్వరలోనే ఆ సినిమా అప్‌డేట్ వచ్చే అవకాశం ఉంది.

# బహుజన సమాజ్ పార్టీ ఎలమంచిలి అసెంబ్లీ ఇన్చార్జిగా చాకలి నూకరాజు



**యలమంచిలి, (రాజధాని వార్తలు):** బహుజన్ సమాజ్ పార్టీ ఎలమంచిలి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జిగా ఎలమంచిలి జంపవరం గ్రామానికి చెందిన చాకలి నూకరాజును నియమిస్తున్నట్టు బహుజన్ సమాజ్ పార్టీ అనకాపల్లి జిల్లా ఇన్చార్జ్ సూదికొండ మాణిక్యాలరావు ఒక ప్రకటనలో తెలిపారు. బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బందెల గౌతమ్ కుమార్ ఆదేశాల మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి కరణం తిరుపతిరావు సూచనల మేరకు గత దశాబ్ద కాలంగా పార్టీ కోసం కష్టపడి పనిచేస్తున్న చాకలి నూకరాజును పార్టీ ఎలమంచిలి అసెంబ్లీ నియోజకవర్గం ఇన్చార్జిగా నియమిస్తున్నట్టు ఆయన తెలిపారు. బహుజన సమాజ్ పార్టీని నియోజకవర్గంలో గ్రామ గ్రామానికి తీసుకువెళ్లి గ్రామీణ స్థాయి నుండి పార్టీ నిర్మాణం చేపట్టి పార్టీ పటిష్టతకు కృషి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పార్టీ కార్యకర్తగా నాయకుడిగా గత దశాబ్ద కాలంగా పార్టీ కోసం కష్టపడి పనిచేసిన నన్ను గుర్తించి అసెంబ్లీ నియోజకవర్గం ఇన్చార్జిగా నియమించినందుకు పార్టీ రాష్ట్ర నేతలకు జిల్లా నేతలకు చాకలి నూకరాజు ధన్యవాదాలు తెలిపారు. పార్టీ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు జిల్లా కమిటీ ఆదేశాలు పాటిస్తూ నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన అన్నారు.



గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట, అల్లూరి సీతరామరాజు పార్క్ నందు ప్రారంభమైన యోగా కార్యక్రమం...యోగా కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్..ముందుగా జిల్లా కలెక్టర్ అల్లూరి సీతారామరాజు సమాధిని సందర్శించి నివాళులు అర్పించారు.

# ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్



**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** సోమవారం కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా పిర్యాదుల పరిష్కార వేదిక (పి జి ఆర్ ఎస్) కార్యక్రమంలో ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, జిల్లా రెవిన్యూ అధికారి వై. సత్యనారాయణ రావు, కె ఆర్ ఆర్ సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్. వి. ఎస్. సుబ్బలక్ష్మి. ఈ కార్యక్రమంలో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి జి రామారావు, జిల్లా పంచాయతీ అధికారి శిరీష రాణి, జిల్లా ఎక్సయిజ్ అధికారి వి సుధీర్, జిల్లా రవాణా శాఖ అధికారి జి.మనోహర్, జిల్లా సర్వే భూ రికార్డుల సహాయ సంచాలకులు గోపాల్ రాజు, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి ఆర్ వెంకటరమణ, ఇతర శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# "అతివేగం" ప్రాణాంతకరం : ట్రాఫిక్ ఎస్ఐ మెట్ట సుధాకర్

## - జేసీఐ శ్రీకాకుళం మెయిన్ అధ్యక్షులు కూన అనిల్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ అవగాహన






**శ్రీకాకుళం, (రాజధాని వార్తలు):** "అతివేగం" ప్రాణాంతకరమని శ్రీకాకుళం ట్రాఫిక్ ఎస్ఐ మెట్ట.సుధాకర్ సోమవారం అన్నారు. స్థానిక పాతబస్ స్టాండ్, పొట్టి శ్రీరాములు కూడలి వద్ద, జేసీఐ శ్రీకాకుళం మెయిన్ అధ్యక్షులు కూన.అనిల్ కుమార్, కార్యక్రమ చైర్మన్ జేసీ ఉర్లం. శివతేజ ఆధ్వర్యంలో ట్రాఫిక్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిగా పాల్గొన్న శ్రీకాకుళం ట్రాఫిక్ ఎస్ఐ మెట్ట.సుధాకర్ మాట్లాడుతూ నగరంలో ఇటీవలి కాలంలో తరచుగా రహదారి ప్రమాదాలు జరుగుతున్నాయని, ట్రాఫిక్ నిబంధనలు ప్రతీ ఒక్కరు పాటించి, ప్రమాదాల నివారణలో భాగమవ్వాలన్నారు. గమ్యానికి తొందరగా చేరుకోవటానికి, వాహనాల్ని అతివేగంగా తీస్తూ, తాను ప్రమాదానికి గురవ్వడంతో పాటు, ప్రక్క వారి ప్రమాదాలకు కూడా కారకులై, కుటుంబ సభ్యులకు దూరమౌతున్నారన్నారు. దయచేసి వాహనాలను నిదానంగా నడుపుతూ, గమ్యానికి సురక్షితంగా చేరుకోవాలని, వాహన చోదకులకు అవగాహన కల్పించారు. హెల్మెట్ వినియోగించాలని, వాహన సంబంధిత కాగితాలుండాలని, లేనిచో, కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

జేసీఐ శ్రీకాకుళం మెయిన్ అధ్యక్షులు కూన.అనిల్ మాట్లాడుతూ అందరికీ ట్రాఫిక్‌పై అవగాహన కల్పిం చటమే ముఖ్య ఉద్దేశ్యమని, యువతకు ట్రాఫిక్‌పై అవగాహన లేక, వాహనాలను అతివేగంతో నడుపుతూ తమ ఉజ్వల భవిష్య త్ని చేజేతులా నాశనం చేసుకుంటున్నారన్నారు. త్రిబుల్ రైడింగ్ వద్దని, సురక్షిత జీవితమే ముద్దని నినాదాలు చేస్తూ జేసీఐ జోన్ -4 జోన్ వైస్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్, కోలామ్ ప్రెసిడెంట్స్ జేసీ అర్జున్, జేసీ వర్మ, జేసీఐ శ్రీకాకుళం మెయిన్ కార్యదర్శి తమ్మినేని.ఉషా రాణి, కోశాధికారి బొడిగి.మధు, ఇతర సభ్యులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డా.చింతాడ కృష్ణమో హన్, మాదవి, జేసీ జగదీష్ మరియు సభ్యులు పాల్గొన్నారు.

# ఈనెల 4వ తేదీన వైసిపి ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం



**పాయకరావుపేట, (రాజధాని వార్తలు):** ఈనెల 4వ తేదీన వైసిపి ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఇంచార్జ్ తహసిల్దార్ గారా ఆనందరావుకు వినతి పత్రం అందజేశారు. ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చి, ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కాలం గడుస్తున్న పథకాలు అమలు చేయకపోవడంతో వెన్నుపోటు దినం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైసిపి నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి లంక సూర్యనారాయణ, దగ్గుపల్లి సాయిబాబా, జగతా శ్రీను, పార్టీ పట్టణ అధ్యక్షుడు ధనిశెట్టి సత్య మహేష్, దేవవరపు రాజేష్ ఖన్నా, ధనిశెట్టి తిరుమలేశ్వరరావు, జగతా శ్రీనివాస్, కొప్పిశెట్టి రామ్మోహన్, కేసనకుర్తి సత్తిబాబు, పోసిన వీరబాబు, రమణ తదితరులు పాల్గొన్నారు.



# జెఇఇ అడ్వాన్సుడ్ ఫలితాలలో శ్రీ ప్రకాష్ విద్యార్థి ప్రతిభ

**పాయకరావుపేట, (రాజధాని వార్తలు):** జెఇఇ అడ్వాన్సుడ్ ఫలితాల నందు శ్రీ ప్రకాష్ విద్యార్థి దేవి డేవిడ్ జాన్సన్ కేటగిరీ విభాగంలో ఆల్ ఇండియా 1353 వ ర్యాంక్ సాధించాడని విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్. విజయ్ ప్రకాష్ తెలిపారు. జెఇఇ అడ్వాన్సుడ్ కోసం ఇస్తున్న స్పెషల్ కోచింగ్ ద్వారా ఈ విద్యార్థి ఈ ర్యాంకును కైవసం చేసుకున్నాడని ఆయన తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యా సంస్థల అధినేత సిహెచ్.వి.కె. నరసింహారావు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు అభినందించారు.

# "ఒంటరి మహిళకు" అండగా బూర్జ ఎస్ఐ మొజ్జాడ ప్రవల్లిక

## - నిత్యావసర సరుకులు అందించి ఆదుకున్న వైనం





**శ్రీకాకుళం, (రాజధాని వార్తలు):** స్థానిక కంపోస్ట్ కోలనీకి చెందిన గేదెల. లక్ష్మి అనే "ఒంటరి మహిళకు" అండగా బూర్జ ఎస్ఐ మొజ్జాడ ప్రవల్లిక నిత్యావసర సరుకులను అందించి అండగా నిలిచారు. ఒక ప్రకటనలో బూర్జ ఎస్ఐ మొజ్జాడ.ప్రవల్లిక మాట్లాడుతూ గేదెల. లక్ష్మి భర్త ఇటీవల అనారోగ్యంతో మరణించారని, ఇప్పుడు లక్ష్మి కూడా ప్లేటిలెట్స్ తగ్గుతూ మంచానికే పరిమితమయ్యారని, చిన్న వయస్కుడైన కుమారునితో జీవనం కొనసాగిస్తుందన్నారు. నిస్సహాయ స్థితుల్లో ఉన్నవారిని ఆదుకోవటం మానవునిగా మన కనీస బాధ్యతని, ఈ రోజు లక్ష్మి కుటుంబానికి నావంతు సహకారంగా రెండు నెలలకు సరిపడే నిత్యావసర సరుకులను పెద్దపాడుకు చెందిన బొట్టా సాయి కుమార్, రెడ్ క్రాస్ ప్రతినిధి నంది ఉమా శంకర్, స్టేట్ బ్యాంకు అఫ్ ఇండియా అసోసియేట్ నల్ల.గౌతమి చేతుల మీదుగా అందించామన్నారు. ఇదివరకు బొట్టా సాయి కుమార్ నిత్యావసర సరుకులు అందించారని, ఈ రోజు నల్ల.గౌతమి కొంతనగదుని లక్ష్మికు అందించటం ఆనందాన్నిచ్చిందన్నారు. ఈ సందర్భంగా దాతలు ఈ ఒంటరి మహిళా కుటుంబానికి ఏదో ఒక రూపంలో సాయమందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గేదెల. లక్ష్మి, సహాయకులు, సేవకులు స్టేట్ బ్యాంకు అఫ్ ఇండియా అసోసియేట్ నల్ల.గౌతమి, పెద్దపాడుకు చెందిన బొట్టా.సాయి కుమార్, రెడ్ క్రాస్ ప్రతినిధి, నంది. ఉమా శంకర్, జేసీ, లైనిజం ఉర్లం.శివతేజ పట్నాయక్ పాల్గొన్నారు.

# తేజస్విని హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో అన్నదానం



**మైలవరం, (రాజధాని వార్తలు):** స్థానిక లక్కిరెడ్డి హనిమీ రెడ్డి కాంప్లెక్స్ వద్ద ఏర్పాటుచేసిన ఉచిత చలివేంద్రం శిబిరం గత 30 రోజులుగా కొనసాగుతుంది. సోమవారం ముగింపు సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రముఖ తేజస్విని ఆసుపత్రి వైద్యులు డాక్టర్ సతీష్ బాబు, డాక్టర్ ఇందిరా ప్రియదర్శినిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నం పరబ్రహ్మ స్వరూపం అని అన్నారు. వేసవిలో ఉచిత చలివేంద్ర శిబిరాన్ని ఏర్పాటు చేసి మజ్జిగ, కూలింగ్ వాటర్ ను అందిస్తు ప్రజల దాహార్తిని తీరుస్తున్నారన్నారు. ప్రతి ఏడాది నిర్వహించటం అభినందనీయమన్నారు. నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో దేవరపల్లి తిరుపతిరెడ్డి, కోట వేణుగోపాల్ రెడ్డి, ఐ నీడ్స్ పుల్లారెడ్డి, ఏ చంద్రం, మల్లికార్జున్ రావు, మల్లికార్జున్ రెడ్డి మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan